క్లుప్తంగా

నెల్లిమర్ల తహసీల్దార్‌గా ధర్మరాజు


ధర్మరాజు, తహసీల్దార్

నెల్లిమర్ల: మండల తహసీల్దార్‌గా డి. ధర్మరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం జిల్లా గాజువాక మండలంలో ఎన్నికల డీటీగా పనిచేసిన ఆయన ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన రమణరాజు వీఆర్‌ఎస్ ఇచ్చిన తర్వాత డీటీ శైలజ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించారు.

గురజాడ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

విజయనగరం ఫూల్‌బాగ్: గురజాడ స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజా ఉద్యమాలు చేపడతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు లోకనాథం అన్నారు. గురజాడ 161వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సీపీఎం నాయకులు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణకు, భావప్రకటనా స్వేచ్ఛకు ఆటంకం కలిగిస్తున్న పాలకుల విధానాలను ప్రజలు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. గురజాడకు నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, జిల్లా కమిటి సభ్యులు రామ్మోహన్, రమణమ్మ, జగన్, రమణ పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: గణపతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గుంకలాం జగనన్న హౌసింగ్ కాలనీలో గురువారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. హౌసింగ్ అసిస్టెంట్ ఇంజినీర్ కొర్లాం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహిచిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గరికిపేటలో వైద్యశిబిరం


రోగులకు మందులు అందజేస్తున్న మిమ్స్ వైద్య సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గరికిపేటలో మిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు బీపీ, సుగర్, ఈసీజీ, తదితర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. 138 మంది రోగులు శిబిరంలో వైద్యసేవలు పొందారు. కార్యక్రమంలో మిమ్స్ పీఆర్వో రాజమహంతి ధనుంజయరావు, గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెస్ చార్జీలు పెంచాలి



కోట వద్ద నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

విజయనగరం ఫూల్‌బాగ్: సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్‌చార్జీలు పెంచడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి డి.రాము, జిల్లా ఉపాధ్యక్షురాలు సౌమ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక కోట వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రమేష్, రవి, వెంకటేష్, రమేష్‌రాజు, సంధ్య, సుష్మిత, షణ్ముఖ, తదితరులు పాల్గొన్నారు.

పొంగిపొర్లుతున్న చెరువులు

లక్కవరపుకోట: గత రెండుచ మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. శ్రీరాంపురం గ్రామ సమీపంలోని కోటవాని చెరువు, లక్కవరపుకోటలోని కిత్తన్నకట్టు చెరువుతో పాటు పలుగ్రామాల్లో చెరువులు అలుగు పారుతున్నాయి. చెరువులు జలకళను సంతరించుకోవడంతో రైతులు ఆనందంగా ఉన్నారు.

విద్యార్థినులకు రక్తపరీక్షలు

వేపాడ: బక్కునాయుడుపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలోని 473 మంది విద్యార్థినులకు వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ధరణి ఆదేశాల మేరకు వైద్యసిబ్బంది గురువారం రక్త పరీక్షలు(హిమోగ్లోబిన్) నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ టి.ఎం.ఫ్లోరెన్స్, వైస్ ప్రిన్సిపాల్ ఉషారాణి, ఏఎన్‌ఎంలు, హెచ్‌ఎస్, ఎంఎల్‌హెచ్‌పీలు, పాఠశాల నర్స్ శారద పాల్గొన్నారు.

ఇంటింటికీ వైద్య సేవలు

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు


ఆయుష్మాన్‌భవ కార్డులను చూపుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, వైద్య సిబ్బంది, ప్రజలు

విజయనగరం రూరల్: ఇంటింటికీ వైద్య సేవలు అందించడమే ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం ఉద్దేశమని డీఎంహెచ్‌ఓ భాస్కరరావు అన్నారు. మండలంలోని ముడిదాం గ్రామంలో రాకోడు పీహెచ్‌సీ సిబ్బంది గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎంహెచ్‌ఓ ప్రజలతో మాట్లాడుతూ, అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఆరోగ్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలో భాగంగా ఆయుష్మాన్ కార్డులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్డు ద్వారా పేదలకు రూ. 5 లక్షల వరకు వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.జగదీష్, ఆరోగ్య సూపర్‌వైజర్లు శ్రీనివాసరావు, శ్రీరామ్మూర్తి, ఆరోగ్య సహాయకులు చిన్నారావు, కృష్ణ, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెల్లూరులో...

మండలంలోని చెల్లూరు గ్రామంలో రాకోడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది జగనన్న సురక్ష కార్యక్రమంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30 నుంచి గ్రామాల్లోని అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందిస్తామన్నారు.

బకాయిలు వసూలు చేయాలి


సమావేశానికి హాజరైన సచివాలయ కార్యదర్శులు

- కార్పొరేషన్ ప్రజారోగ్యాధికారి కొండపల్లి సాంబమూర్తి

విజయనగరం: నగరంలోని దుకాణాలకు సంబంధించి ట్రేడ్ లైసెన్స్ బకాయిలను తక్షణమే వసూలు చేయాలని సిబ్బందికి కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి ఆదేశించారు. ఈ మేరకు గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో ఇప్పటివరకు 1,803 దుకాణాలకు సంబంధించి ట్రేడ్ లైసెన్స్‌లు మంజూరు చేసినట్లు చెప్పారు. చాలాకాలంగా కొంతమంది దుకాణదారులు లైసెన్స్ రుసుం చెల్లించడం లేదన్నారు. యుద్ధ ప్రాతిపదికన బకాయిలు వసూలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ఇందుకోసం పారిశుధ్య పర్యవేక్షకులతో టీమ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. సచివాలయ పరిధిలో ఉన్న దుకాణాలకు సంబంధించి బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని కార్యదర్శులకు దిశానిర్దేశం చేశామన్నారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ రమేష్‌రాజు, పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, సలీం రాజు, అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పరిశీలన


జగనన్న ఆరోగ్య సురక్ష స్క్రీనింగ్ కార్డును అందజేస్తున్న ఎంపీడీఓ రాధిక

పూసపాటిరేగ: మండలంలోని కనిమెల్లలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఎంపీడీఓ ఎం. రాధిక గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు నమోదైన రోగుల వివరాలు, జారీ చేసిన టోకెన్లపై ఆరా తీశారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, వైద్య సిబ్బంది, కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, వైద్యసిబ్బంది వేదమణి, నానమ్మ, ఆర్‌వీ రమణ, కార్యదర్శి రవి, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


మాట్లాడుతున్న ఎస్సై నారాయణరావు

నెల్లిమర్ల: విద్యార్థులంతా చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాల అధిరోహించాలని ఎస్సై పి. నారాయణరావు అన్నారు. గురువారం స్థానిక బీసీ బాలికల వసతిగృహంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, విద్యార్థినులు ఈవ్‌టీజింగ్, సైబర్‌క్రైమ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి జి. కృష్ణవేణి, మహిళా పోలీస్ జగదీశ్వరి, వసతిగృహ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న కింగ్‌కాంగ్ సెట్


అలరిస్తున్న కింగ్‌కాంగ్ సెట్

నెల్లిమర్ల: మండలంలోని జరజాపుపేట న్యూ ఫ్యాషన్ బాయ్స్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వేసిన కింగ్‌కాంగ్ భారీ సెట్ అలరిస్తోంది. సెట్‌లో పలు దేవతామూర్తులతో పాటు వినాయక విగ్రహం ఏర్పాటు చేసి ప్రతిరోజూ పూజలు చేస్తున్నారు. సెట్‌ను తిలకించడానికి సమీప ప్రజలు అధిక సంఖ్యలో వస్తున్నారు.

సకాలంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే


జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి సుధారాణి

- మండల ప్రత్యేకాధికారి సుధారాణి

భోగాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేను సకాలంలో పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి సుధారాణి ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, వలంటీర్లను ఆదేశించారు. మండలంలోని బైరెడ్డిపాలెం గ్రామంలో గురువారం చేపడుతున్న సర్వేను ఆమె పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చింత బంగార్రాజు, ఎంపీడీఓ అప్పలనాయుడు, పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతి స్వామి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు నెల్లిమర్లలో 'జగనన్నకు చెబుదాం'

విజయనగరం అర్బన్: నెల్లిమర్ల మండల ప్రజల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించనున్న 'జగనన్నకు చెబుదాం' స్పందన కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. నెల్లిమర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి తనతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరవుతారన్నారు.

అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ


విజయనగరం అర్బన్: గురజాడ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న చైర్మన్ డాక్టర్ శంకరరావు


డెంకాడ: మహాకవి గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ మహేష్, పాఠకులు

డెంకాడ: మహాకవి గురజాడ అప్పారావు అభ్యుదయ కవితా పితామహుడని స్థానిక శాఖా గ్రంథాలయాధికారి మహేష్ అన్నారు. గ్రంథాలయంలో మహాకవి గురజాడ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లైబ్రేరియన్ మహేష్ మాట్లాడుతూ.. సమాజంలోని లోపాలు, అసమానతలను తన రచనల ద్వారా బహిర్గతం చేసి, సమాజ సంస్కరణకు కృషి చేసిన మహానుభావుడు గురజాడ అని కొనియాడారు. ఆయన రచనల్లో కన్యాశుల్కం నాటకం చాలా ప్రాచుర్యం పొందిందన్నారు. కార్యక్రమంలో పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

గురజాడకు నివాళులర్పించిన ఎస్టీ కమిషన్ చైర్మన్..

విజయనగరం అర్బన్: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు గురువారం స్థానిక గురజాడ గృహాన్ని సందర్శించారు. ప్రాంగణంలో ఉన్న గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి, గురజాడ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ..

ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు గురువారం స్థానిక జెడ్పీ అతిథిగృహంలో గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి కమిషన్ పరిధిలో ఉన్న సమస్యలు తప్పనిసరిగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ప్రతి ఇంటా సంక్షేమ పథకాల పంట


47వ డివిజన్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల తమ్మన్నశెట్టి
- నగరంలోని 47వ డివిజన్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'

విజయనగరం: వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి ఇంటా సంక్షేమ పథకాల పంట పండుతోందని ఆ పార్టీ జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల తమ్మన్నశెట్టి అన్నారు. నగరంలోని 47వ డివిజన్ పరిధి కంటోన్మెంట్ పరిధిలో గల యాతవీధి నుంచి గురువారం ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్కో ఇంటికి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని తెలియజేస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అర్హతలుండి సంక్షేమ పథకాలు పొందని వారికి కూడా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల సిఫార్సులు అవసరమయ్యేవన్నారు. కాని ప్రస్తుత జగనన్న పాలనలో ఎటువంటి సిఫార్సులు లేకుండానే, అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరవుతున్నాయని చెప్పారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే పథకాల నగదు జమవుతుండడంతో దళారీల బెడద తప్పిందన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గడప గడపకు.. కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో నగరం అన్నివిధాలా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. కార్పొరేటర్ పట్నాన పైడిరాజు మాట్లాడుతూ, తమ డివిజన్‌లో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా మిగిలిపోయిన సమస్యలను కూడా పరిష్కరిస్తున్న ఘనత డిప్యూటీ స్పీకర్ కోలగట్లకు దక్కుతుందన్నాని చెప్పారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ దుబే, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలి


అధికారులకు సూచనలిస్తున్న మండల ప్రత్యేకాధికారి సుధారాణి

భోగాపురం: మండలంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు, గృహ నిర్మాణాలు, వివిధ పంచాయతీల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేకు సంబంధించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి సుధారాణి కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ, ఆర్‌బీకే, వెల్‌నెస్ భవన నిర్మాణాలపై ఆరా తీశారు. భవన నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చింత బంగార్రాజు, ఎంపీడీఓ అప్పలనాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకోవాలి..


నెల్లిమర్లకు చేరుకున్న ఉక్కు పరిరక్షణ యాత్ర

నెల్లిమర్ల: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాల ద్వారా పరిరక్షించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె. లోకనాథం పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ – ఉక్కు రక్షణయాత్ర పేరిట సీపీఎం ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన బైక్‌ర్యాలీ నెల్లిమర్ల చేరుకుంది. యాత్రకు ప్రజా సంఘాలు స్వాగతం పలికి మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 29న కూర్మన్నపాలెంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకుడు రామారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, నాయకులు రెడ్డి శంకరరావు, టీవీ రమణ, ఎ. జగన్‌మోహనరావు, బి. సుధారాణి, బి. రమణ, పి. రామ్మోహనరావు. పి. రమణమ్మ, కిల్లంపల్లి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి...

- వర్షా కాలంలో జీవాల కాళ్లకు పుండ్లు
- డాక్టర్ మర్రాపు శ్రీకాంత్


కాళ్ల పుండ్లు (డెక్కజడుపు) సోకిన మూగజీవం

డెంకాడ: వర్షాకాలంలో మూగ జీవాల కాళ్లకు పుండ్లు (గిట్టల పుండ్లు వ్యాధి) అధికంగా సోకుతాయని..జాగ్రత్తలు పాటిస్తే జీవాలను రక్షించుకోవచ్చని అక్కివరం పశువైద్య కేంద్రం డాక్టర్ మర్రాపు శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై ఆయన పలు సూచనలు చేశారు.

వ్యాధి లక్షణాలు..

వర్షాకాలంలో అన్ని రకాల జీవాలకు కాళ్ల పుండ్లు (డెక్క జడుపు) సోకుతాయి. గొర్రెలు, మేకలు, పశువులకు ఈ వ్యాధి సోకుంది. జీవాలకు గిట్టలు మధ్యలో చర్మం మెత్త బడి వాచిపోయి చిట్లిపోతుంది. చీము పట్టి నొప్పితో జీవాలు నడలేక చాలా ఇబ్బంది పడిపోతాయి.

చికిత్స..

వ్యాధి సోకిన జీవాల కాళ్లను (1:1000) కేఎస్‌ఎంవో4 ద్రావకంతో కడిగి అనంతరం బోరిక్ పౌడర్‌ను ఆయిల్‌లో కలిపి పూయాలి. యాంటీబయోటిక్ ఇంజక్షన్లు వరుసగా 3 నుంచి 5 రోజుల పాటు చేయించాలి.

జాగ్రత్తలు..

వ్యాధి సోకిన జీవాలను చిత్తడి నేలల్లో ఎక్కువగా తిరగనీయరాదు. పుండ్లు ఆశించిన వెంటనే వైద్యుల వద్దకు తీసుకెళ్లాలి.

ప్రాథమిక దశలోనే చికిత్స అందించాలి..



వర్షాకాలంలో కాళ్లకు పండ్లు సోకుతాయి. మూగజీవాలు, పశువులకు వ్యాధి సోకిన వెంటనే వైద్య చికిత్స చేయించాలి. లేకపోతే తీవ్ర అనారోగ్యం బారిన పడతాయి. గ్రామ సచివాలయాయాల్లో కూడా వెటర్నరీ అసిస్టెంట్లు అందుబాటులో ఉన్నారు.

– మర్రాపు శ్రీకాంత్, పశువైద్యాధికారి, అక్కివరం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని 11కేవీ విద్యుత్ లైన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలిగించనున్న సందర్భంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎస్ఈ ముప్వల లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నటరాజ్ కాలనీ, ఎంఎస్ఎన్ కాలనీ, ప్రశాంతినగర్, సాయినగర్, ఇస్ ఫ్యాక్టరీ జంక్షన్, పీఎస్ఆర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.